


ఫార్ములా ఈ కార్ రేస్ అక్రమ కేసు వ్యవహారంలో ఈడీ విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ గురువారం హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ శ్రేణులు ఈడీ కార్యాలయానికి తరలివెళ్లారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్




### కల్పతరువుగా ప్రైవేటు దవాఖానలు..

వైద్యారోగ్యశాఖలో ఏండ్లుగా పాతుకుపోయిన కొంతమంది వ్యక్తుల పాత్ర వివాదాస్పదమవుతున్నది. దవాఖానల పర్మిషన్ల దగ్గరి నుంచి తనిఖీల వరకూ అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. నిరంతర తనిఖీలు చేపట్టి దవాఖానల్లో జరుగుతున్న ప్రజావ్యతిరేక చర్యలను అరికట్టాల్సి ఉండగా అవేమీ జరగడం లేదు. నిజామాబాద్‌లో వందలాది దవాఖానలకు డీఎంహెచ్‌వోకు చెందిన ఓ కీలక ఉద్యోగి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. ఏ చిన్న ఘటన వెలుగుచూసినా రంగంలోకి దిగి మేనేజ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. చివరికి పోలీసులను సైతం పక్కదారి పట్టించి దవా ఖానల్లో జరిగే కేసులకు మీకు సంబంధం లేదంటూ దబాయిస్తున్నట్లుగా తెలిసింది. ప్రైవేటు దవాఖానలైతే అక్రమార్కులకు కల్పతరువుగా మారాయి. అడిగినంత మామూళ్లు ఇచ్చుకుంటున్న నేపథ్యంలో ప్రైవేటు దవాఖానల యాజమాన్యాలు సైతం బరితెగించి పోతున్నాయి. జిల్లాస్థాయి అధికారి తనిఖీలకు వచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కింది స్థాయిలో మేనేజ్‌మెంట్ చర్యల్లో భాగంగానే ఇదంతా జరుగుతున్నది చెబుతున్నారు. వైద్యారోగ్య శాఖలో వేలు పెట్టేందుకు జిల్లా ఉన్నతాధికారి సైతం ఆసక్తి చూపకపోవడంతో అక్రమార్కుల తీరు మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా పేట్రెగిపోతున్నది. దీనికి అడ్డుకట్ట వేయాలని సర్వత్రా డిమాండ్ వినిపిస్తోంది.



### పారదర్శకంగా చేపడతాం

కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేపడుతున్న ఉద్యోగాల నియామకాలను పారదర్శకంగా చేపడతాం. అక్రమంగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు. బాధితులనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పాం. మేము స్పందించేందుకు ఎలాంటి ఆధారం మాకు దొరకడం లేదు. మా శాఖ సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా? లేదా? అన్నది తెలుసుకుంటాం.

**- రాజశ్రీ, డీఎంహెచ్‌వో, నిజామాబాద్**




# వైద్యశాఖలో వసూల్ రాజాలు!

- స్టాఫ్‌నర్సు మెరిట్ జాబితా అక్రమార్కుల చేతుల్లోకి..
- ఉద్యోగాలిప్పిస్తామంటూ అభ్యర్థులతో బేరసారాలు
- అవినీతి ఆరోపణలు మూటగట్టుకుంటున్న వైద్యారోగ్య శాఖ
- ఏండ్లుగా పాతుకుపోయిన అధికారులు
- కల్పతరువుగా ప్రైవేట్ దవాఖానలు
- శాశ్వత అధికారి వచ్చినా మారని పనితీరు

నిజామాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ వైద్యారోగ్య శాఖ గాడిలో పడడం లేదు. ప్రజాపాలన షురూ అయ్యాక పరిస్థితి అధ్వానంగా మారింది. శాశ్వత అధికారిగా డీఎంహెచ్‌వో నియామకమైనప్పటికీ గందరగోళం చోటు చేసుకుంటున్నది. తాజాగా తాత్కాలిక ఉద్యోగ నియామకాల్లో డీఎంహెచ్‌వోకు చెందిన ఓ వ్యక్తి బహిరంగంగానే ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేయడం కలకలం రేపుతున్నది. నియామకప్రక్రియ పారదర్శకంగా చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఉన్నప్పుడు పరిపాలన గందరగోళంగా ఉండేది. ఇష్టారీతిన అక్రమాలు జరిగాయి. అడిగేవారు లేకపోవడంతో పాత అధికారి పెత్తనం అంతటా వ్యాపించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలను నడిపి జేబులు నింపుకొన్నారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. ఏకంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే ఏసీబీ దాడులు జరిగాయి. సోదాలు రోజుల తరబడి చేపట్టారు. లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే అవినీతిపరులు చిక్కారు. శాఖ పరువును మంటగలిసిపోతున్నప్పటికీ కొంతమందిలో మార్పు రాకపోవడం చర్చనీయాంశం అవుతున్నది.

### ప్రతి పనికీ వసూళ్లు...

ఏడాది క్రితం నిజామాబాద్ జిల్లాలో 30 స్టాఫ్ నర్సులు, ముగ్గురు ఏఎన్‌ఎంల భర్తీ చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. కొన్ని అనివార్య కారణాలతో వాయిదా పడుతూ వచ్చినా ఈ ప్రక్రియను కొంతమంది డీఎంహెచ్‌వో ఉద్యోగులు డబ్బులు దండుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మొత్తం 876 దరఖాస్తులు రాగా వీరిలో అర్హులైన వారి జాబితాను చేజిక్కించుకున్నారు. వారి వివరాలను తెలుసుకుని ఫోన్లు చేసుకుంటూ బహిరంగంగానే డబ్బులు డిమాండ్ చేశారు. మీకు ఉద్యోగం రావాలంటే రూ.లక్షన్నర చెల్లించుకోవలంటూ డిమాండ్‌ను ముందుంచారు. ముందస్తుగా రూ.25 వేలు చెల్లించాలని కోరారు. కొంతమంది డబ్బులు ఇచ్చేందుకు సిద్ధం కాగా.. మరికొంత మంది కంగుతిని, ఈ విషయాన్ని బయటపెట్టారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా కనీసం పట్టించుకోవడం లేదు. బాధితులే వెళ్లి పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు ఇచ్చుకోవాలంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. నియామకాలను పారదర్శకంగానే చేపడతామంటూ చెబుతున్నప్పటికీ, అవినీతి ఆరోపణలు వెలుగుచూసిన దరిమిలా విచారణ చేపట్టి ఇంటి దొంగల భరతం పట్టేందుకు నడుం బిగించకపోవడంపై ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడేం కొత్త కాదు. డీఎంహెచ్‌వోలో తరచూ జరిగే తంతు. వసూల్ రాజాతో చాలా మందికి పరిచయాలున్నాయి. వారితో ఆర్థిక సంబంధాలున్న నేపథ్యంలో వీరిని కదిపితే చాలా మందికి ఉద్యోగ ముప్పు పొంచి ఉన్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. అందుకే ఇంత జరుగుతున్నా ఉలుకూ పలుకూ లేదని వైద్యారోగ్య శాఖపై విమర్శలు వస్తున్నాయి.




# బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన పోచారం

- కాంగ్రెస్‌లో ముగ్గురు మొనగాళ్లు.. పోటీపడి నిధులు తీసుకురండి!
- అనుచరులతో ప్రెస్‌మీట్లు పెట్టించి విమర్శలు చేయిస్తారా?
- కేసీఆర్ హయాంలో బాన్సువాడకు పుష్కలంగా నిధులు
- బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ జుబేర్

బాన్సువాడ , జనవరి 16 : బాన్సువాడ కాంగ్రెస్ పార్టీలో ముగ్గురు మొనగాళ్లు ఉన్నారని, వీరు హైదరాబాద్‌లో కలిసి ఉంటూ, నియోజకవర్గంలో మాత్రం అనుచరుల భుజాలపై తుపాకులు పెట్టి కాల్చుతారని బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ విమర్శించారు. బాన్సువాడ ప్రజలపై ప్రేమ ఉంటే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.వెయ్యి కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి జరిగేలా పోటీ పడి పనిచేయాలని పరోక్షంగా పోచారం, కాసుల బాల్‌రాజ్, ఏనుగు రవీందర్‌రెడ్డికి సూచించారు. గురువారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.కోట్లాది నిధులు ఇచ్చి పోచారాన్ని గౌరవించిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, కన్న తల్లిలాంటి బీఆర్ఎస్‌కు ద్రోహం చేశారన్నారు.

### బాన్సువాడ జిల్లా ఏర్పాటు ఎటుపాయే!

గతంలో కాసుల బాల్‌రాజ్ కాంగ్రెస్ పార్టీ తరపున బాన్సువాడను జిల్లాగా ఏర్పాటు చేయాలని వందరోజులపాటు ధర్నా చేశాడని గుర్తుచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, జిల్లా ఏర్పాటు ఎటుపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

### అవినీతికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోండి

వర్ని యెలమంచలి శ్రీనివాస్, పాత బాలు వ్యాఖ్యలను ఖండించారు. బీఆర్ఎస్ హయాంలో నియోజక వర్గంలో అవినీతి జరిగిందని యెలమంచలి శ్రీనివాస్ రావు ఆరోపించారని తెలిపారు. దీనిపై కాంగ్రెస్ ప్ర భుత్వం విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడిన వా రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుతామన్నారు.

### త్వరలోనే గుడ్ మార్నింగ్ బాన్సువాడ/ పల్లెటూరు..

బాన్సువాడ నియోజక వర్గంలో త్వరలోనే గుడ్ మార్నింగ్ బాన్సువాడ, గుడ్ మార్నింగ్ పల్లెటూరు అనే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని జుబేర్ వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని గ్రామాల్లో ప్రజలను కలిసి ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వివరిస్తామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మోచి గణేశ్, చాకలి సాయిలు, మహేశ్, అఫ్రోజ్, శ్రీకాంత్, మౌలా, సుమేల్, రమేశ్ యాదవ్, శివసూరి, గౌస్, బైరాపూర్ కుమ్మరి దత్తు, బేగరి సాయిలు, బీర్కూర్ మాజీ వార్డు సభ్యుడు మేక రాములు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బైఠాయించిన మెప్మా ఆర్పీలు

# మెప్మా ఆర్పీల ఆందోళన

- నిజామాబాద్ కార్పొరేషన్ ఎదుట ధర్నా
- నిలిపేసిన నెల జీతం ఇవ్వాలని డిమాండ్

కంఠేశ్వర్, జనవరి 16 : నిలిపివేసిన ఒకనెల జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మెప్మా ఆర్పీలు నిజామాబాద్ నగర పాలక సంస్థ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. తమకు ఆరు నెలల జీతాలు విడుదలు కాగా.. కేవలం ఐదు నెలలే చెల్లించారని తెలిపారు. ఒకనెల జీతం ఎందుకు ఆపేశారని అధికారులను అడిగితే, సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనకపోవడంతో నిలిపివేసినట్లు చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటివరకూ ప్రభుత్వం చేపట్టిన ప్రతి సర్వేలో తాము పాల్గొన్నామని తెలిపారు. అనారోగ్య కారణాలతో కొంత మంది కుటుంబ సర్వేలో పాల్గొనలేదని, దానిని కారణంగా చూపుతూ జీతాలను నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక నెల వేతనం నిలిపివేయడంపై మెప్మా పీడీ రాజేందర్‌ను వివరణ కోరగా, జీతాలు అందరికీ ఇచ్చామని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనకపోవడానికి వివరణ ఇవ్వాలని కోరగా, కొంతమంది ఇచ్చారని మరి కొంతమంది ఇవ్వలేదని చెప్పారు. పై అధికారుల ఆదేశాలను ప్రకారం తాము పాటిస్తున్నట్లు తెలిపారు.




**స్టేషన్‌లోనే సివిల్ పంచాయితీలు**

## సెటిల్మెంట్లకు అడ్డా..

# భీమ్‌గల్ ఠాణా!

- డబ్బుల వసూలు కోసం ప్రత్యేక మధ్యవర్తులు
- బాధితుల నుంచి సైతం వసూళ్లు
- ఇసుకాసురుల నుంచి నెలవారి మామూళ్లు
- వివాదాల్లో సీఐ, ఎస్సై
- ఏడాదికాలంలో ఇద్దరు సీఐల బదిలీ
- అభాసుపాలవుతున్న 'పోలీసులు'



మోర్తాడ్/భీమ్‌గల్, జనవరి 16: భీమ్‌గల్ పోలీసుస్టేషన్ సెటిల్మెంట్లకు అడ్డాగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ఫిర్యాదులను కాకుండా సివిల్ పంచాయితీలను పరిష్కరిస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని నెలలుగా పోలీసుస్టేషన్ వివాదాలకు కేంద్ర బిందువు కాగా.. తాజాగా సీఐ ఆకస్మిక బదిలీతో అభాసుపాలవుతున్నది. గడిచిన ఏడాదికాలంలో పలు వివాదాల్లో తలదూర్చిన ఇద్దరు సీఐలు బదిలీ కావడం ఇక్కడి పరిస్థితికి అద్దంపడుతున్నది. ఇక్కడ చోటుచేసుకున్న కొన్ని సంఘటనల నేపథ్యంలో న్యాయం కోసం భీమ్‌గల్ ఠాణాకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### అవినీతి ఆరోపణలెన్నో..

న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న ప్రజల నుంచి మధ్యవర్తుల ద్వారా భారీగా ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏడాదిగా భీమ్‌గల్ మండలంలో ఇసుక అక్రమరవాణా జోరుగా కొనసాగింది. ఇందులో పోలీసులకు నెలవారి మామూళ్లు అందినట్లు సమాచారం. మామూళ్లు ఇవ్వని వాహనాలు పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సివిల్ కేసుల కోసం ప్రత్యేకంగా మధ్య వర్తులు ఉండడం, వీరంతా పోలీస్‌స్టేషన్ సమీపంలోనే తచ్చాడుతుండడంతో పోలీస్‌స్టేషన్‌లో ఏ మేరకు పంచాయితీలు, పైరవీలు జరుగుతున్నాయో స్పష్టమవుతున్నది. భూవివాదం, హత్యలు, రోడ్డు ప్రమాదం ఇలా కేసును బట్టి చేతులు తడపాల్సిందేనని భీమ్‌గల్ మొత్తం కోడైకూస్తున్నది. కేసు పెట్టేవారైనా, కేసులో ఇరుక్కున్న వారైనా ఇరువర్గాల వారి నుంచి భారీగానే వసూలు చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి.

### కుటుంబ తగాదాల్లోనూ తలదూర్చి..

ఇటీవల మండలంలోని చేంగల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు తనను పోలీసులు వేధిస్తున్నారంటూ సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేశాడు. ఆ వీడియో వైరల్ కావడంతో ఎస్సై వ్యవహారం కూడా బయటికి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. మరో కేసులో తన లొకేషన్‌ను సీఐ ట్రేస్ చేసి ఇవ్వడం కారణంగానే తనపై దాడి జరిగిందని భీమ్‌గల్‌కు చెందిన సత్యగంగయ్య ఏసీపీ విచారణలో చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సీఐ నవీన్‌కుమార్‌ను జిల్లా హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

### ఏడాదిలో ఇద్దరు సీఐల బదిలీ

భీమ్‌గల్ సీఐగా పనిచేసిన ఇద్దరు ఏడాది కాలంలోనే బదిలీ కావడం గమనార్హం. భీమ్‌గల్ సీఐగా నాగపురి శ్రీనివాస్ నిర్మల్ నుంచి జనవరి 2024లో వచ్చాడు. వచ్చిన ఆరునెలల్లోనే ఇసుక వివాదంలో ఇరుక్కుని జూన్ 24న బదిలీ అయ్యారు. ఆయన తరువాత మెట్‌పల్లి నుంచి భీమ్‌గల్‌కు బదిలీపై సీఐగా నవీన్‌కుమార్ జూన్ 24న వచ్చారు. ఇతను బాధ్యతలు స్వీకరించిన ఆరునెలలకే జనవరి 14న బదిలీపై వెళ్లాల్సి వచ్చింది. అయితే ఇతడిపై భార్య, భర్తల కేసు విషయంలో పలు ఆరోపణలు వచ్చాయి.



### ఇసుకాసురుల నుంచి కాసులు

భీమ్‌గల్ సర్కిల్ పరిధిలోని భీమ్‌గల్, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగింది. ఇసుకాసురుల నుంచి దండిగా మామూళ్లు వసూళ్లు చేసినట్లు తెలిసింది. నెలవారి మామూళ్లతోపాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే పంచాయితీదారుల నుంచి దండుకోవడం వంటి సంఘటనలతో భీమ్‌గల్ సర్కిల్ పోలీస్ వ్యవస్థ అభాసు పాలవుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అవినీతి ఆరోపణలపై విచారణ చేయించి, పోలీసులు ప్రజల పక్షాన ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చెరుకు పండిస్తేనే ఫ్యాక్టరీ ప్రారంభం

**బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి**

శక్కర్‌నగర్, జనవరి 16: రైతులు చెరుకు పండిస్తేనే నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభానికి చర్యలు చేపడతామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్‌లోని టీటీడీ కల్యాణమండలంలో గురువారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బోధన్ ప్రాంత అభివృద్ధికి చక్కెర ఫ్యాక్టరీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అయితే, రైతాంగం చెరుకు పండిస్తే ఫ్యాక్టరీ ప్రారంభానికి చర్యలు చేపడతామన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు అంతర్‌జిల్లా దొంగల అరెస్టు



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న మాట్లాడుతున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

- రెండు బైకులు, రూ.4 లక్షలు విలువ చేసే బంగారు, ఇతర వస్తువులు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి వెల్లడి

కామారెడ్డి, జనవరి : 16: జిల్లాలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ చైతన్యారెడ్డి తెలిపారు. గురువారం ఆమె కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 10న పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో ఉన్న ఐదు ఆలయాల్లో జరిగిన చోరీపై ఆలయ చైర్మన్ కృష్ణయాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. గురువారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ముగ్గురు అనుమానితులను పోలీసులు పట్టుకొని విచారించారని చెప్పారు. విచారణలో కామారెడ్డి పోలీసు స్టేషన్ పరిధిలో ఐదు, దేవునిపల్లి పరిధిలో మూడు, భిక్కనూర్, రామారెడ్డి, ఎడపల్లి పోలీసుస్టేషన్ల పరిధిల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 11 దొంగతనాలు చేసినట్లు తేలిందని తెలిపారు. ఈ కేసులో నిందితులైన కామారెడ్డికి చెందిన నిమ్మలవోయిన సురేశ్, డిచ్‌పల్లి మండలం నడిపల్లికి చెందిన రుద్రబోయిన గణేశ్, ఎడపల్లి మండలం తాడెం గ్రామానికి చెందిన గాజుల శ్రీధర్‌ను అరెస్టు చేసి, వారి నుంచి రూ.4 లక్షల విలువ చేసే మూడు గ్రాముల బంగారం, మూడు బైకులు, రెండు మైక్ సెట్లు, ఒక ఆటో, ఒక మేక, ఏడు జతల వెండి కండ్లు, ట్రాక్టర్ బ్యాటరీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.